ఆర్టీసీ ఆదాయానికి గండి



ఎస్.కోట ఆర్టీసీ డిపో ఎదుట పార్కింగ్ చేసిన ఆటోలు

- కాంప్లెక్స్ ప్రాంగణంలోనే ఆటోల పార్కింగ్
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు.. పనిచేయని ఆర్టీఏ చట్టాలు
- పత్తా లేని పరిరక్షణ సమితి

శృంగవరపుకోట: ప్రజారవాణా వ్యవస్థగా పేరు పడ్డ ఆర్టీసీ నష్టాలు, కష్టాలు చూస్తోంది. ఆటోల వల్ల ఆర్టీసీకి ఉన్న కొద్దిపాటి ఆదాయానికి కత్తెర పడుతుంటే అధికారులు పట్టించుకోకపోవడంతో నష్టాలతో నెట్టుకొస్తోంది. స్థానిక ఆర్టీసీ డిపో ప్రాంగణం ఆటోల పార్కింగ్ జోన్‌గా మారింది. విశాఖ–అరకు ప్రధాన రహదారిలోఉన్న ఆర్టీసీకాంప్లెక్స్ డిపో ఎదుట నిత్యం పదుల సంఖ్యలో ఆటోలు బారులు తీరుతున్నాయి. అసలే ఆక్యుపెన్సీ లేక ఇబ్బందులు పడుతున్న ఆర్టీసీకి ఆటోలు తలనొప్పిగా మారాయి. డిపో ఎదుటనే ఆటోలు పెట్టి, ప్రయాణికులను ఆకర్షించుకుంటూ టికెట్ సర్వీస్ చేస్తున్నారు. దీంతో ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోంది.

చట్టాలు అమలు చేసేచిత్త శుద్ధి కరువు..

ఆర్టీసీ పరిరక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయి. అయితే వాటిని అమలు చేసే చిత్తశుద్ధే అధికారుల్లో కరువయ్యింది. దీంతో ఆటోలు ఆర్టీసీకాంప్లెక్స్ చుట్టూనే చేరుతున్నాయి. ఆర్టీసీ డిపోలకు 2కిలోమీటర్ల పరిధిలో ప్రైవేటు వాహనాల పార్కింగ్ చేయకూడదు. టికెట్ సర్వీస్ చేయకూడదన్న నిబంధనలు ఉన్నాయి. కాగా కనీసం 2 మీటర్ల పరిధి కూడా లేకుండా ఆటోలు యథేచ్ఛగా సర్వీసు చేస్తున్నాయి. గతంలో ఆర్టీసీ పరిరక్షణ సమితి పేరుతో ఆర్టీసీ అధికారులు, కండక్టర్లు, డ్రైవర్లు ఒక గ్రూపుగా ఏర్పాటై స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట పహారా కాస్తూ ఆటోలు కాంప్లెక్స్ ఎదుట పార్కింగ్ చేయకుండా, ప్రయాణికుల్ని తరలించుకు పోకుండా అడ్డుకునే వారు. ఆర్టీసీ ఆదాయానికి గండి పడకుండా అడ్డుకునేవారు. ఇప్పుడు పరిరక్షణ సమితి పత్తా లేకుండా పోయింది. కాంప్లెక్స్ మెయిన్ గేట్, ఇన్ గేట్ వద్ద నిత్యం పదుల సంఖ్యలో ఆటోలు పార్కింగ్ చేస్తున్నారు. సర్వీస్ చేసుకోవడమే పరమావధిగా తమకు నచ్చిన చోట ఆటోలు ఆపేస్తున్నారు. ప్రధాన రహదారిలోనూ ఎక్కడపడితే అక్కడఆటోలు నిలిపివేస్తుండడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు, అవస్థలు పడుతున్నారు.

ఎండీఎం కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న ఎండీఎం కార్మికులు, సీపీఎం నాయకులు

శృంగవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం పథకం(ఎండీఎం) కార్మికులు స్థానిక మండల విద్యావనరుల కేంద్రం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, వ్యవసాయ,కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎండీఎం కార్మికులు వంటచేస్తున్నారని, ప్రభుత్వం మాత్రం 6 నుంచి 8వ తరగతి విద్యా ర్థుల సంఖ్య ఆధారంగానే వేతనం ఇస్తోందని, 9,10 తరగతుల విద్యార్థులకు వంట చేస్తున్నందుకు పూర్తిగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. దోపిడీని అడ్డుకోవాలిస్సిన ప్రభుత్వాలే శ్రమ దోపిడీకి పాల్పడడం సిగ్గుచేటన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో వేతనాలు విడుదల చేయాలని, విధు ల్లోంచి తొలగించిన వారిని వెంటనే మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 9,10 తరగతుల విద్యార్థులకు వంటలు బంద్ చేస్తామని చెప్పారు. కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రవేశ పెట్టి అక్షయపాత్ర సంస్థకు సొ మ్ము చెల్లిస్తున్న సర్కారుకు స్కూళ్లలో వంట చేస్తున్న మహిళల ఇక్కట్లు కనిపిండం లేదా అంటూ ప్రశ్నించారు. ఎండీఎం కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం రూ.10,000 చెల్లించాలని, వంట సరుకులు, వంట గ్యాస్ నేరుగా స్కూళ్లకు ప్రభుత్వం సరఫరా చేయాలని, ఏకరూప దుస్తులు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. మండల ఎండీఎం కార్మికుల సంక్షేమ సంఘ సభ్యులు బి.బంగా రమ్మ, డి.లక్ష్మి, ఏ.భవాని, పి.ఈశ్వరి, సీహెచ్.కోటమ్మ, ఎం.గౌరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుర్ల: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శేషుబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అతిథిగా హాజరు కానున్నారని, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

కొత్తవలస మండల సర్వసభ్య సమావేశం రేపు

కొత్తవలస: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేయాలి

వేపాడ: ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో కిచెన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసి ఆకు కూరలు, కాయగూరల పంటలు పండించాలని పాఠశాలల ఆయాలకు ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు సూచించారు. పరిసరాల పరిశుభ్రత, కిచెన్ గార్డెన్‌ల నిర్వహణపై స్థానిక విద్యావన రుల కేంద్రంలో ఆయాలకు సోమవారం అవగాహన కల్పించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు పాఠశాలలోనే ఉండాలని, నాలుగు పర్యాయాలు టాయిలెట్లు శుభ్రం చేయాలని ఆదేశించారు.

నేడు నేత్రవైద్య శిబిరం

మెరకముడిదాం: స్థానిక పీహెచ్‌సీలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం నేత్రవైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్యాంపు సమన్వయకర్త వెంకటరమణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దలతో పాటు పిల్లలకు కంటి పరీక్షలు చేయనున్నామని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బొంతల కోటికి సన్మానం


ఉపాధ్యాయుడు బొంతలకోటిని సన్మానిస్తున్న విజయ్‌కుమార్‌రాజు, లయన్స్ క్లబ్ సభ్యులు

గజపతినగరం: వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సాధించిన ఉపాధ్యాయుడు బొంతల కోటి శంకరరావును స్థానిక బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ థర్డ్ వైస్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్‌రాజు, స్థానిక లయన్స్ క్లబ్ పూర్వ రీజినల్ చైర్‌పర్సన్ బెల్లాన లక్ష్మీనరేన్ ఉపాధ్యాయుడు శంకరరావును సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పూర్వ గవర్నర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన


వల్లంపూడిలో వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణం

వేపాడ: మండలంలోని వల్లంపూడి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నాగభూషణం సోమవారం సందర్శించారు. విద్యార్థు లతో తెలుగు, ఇంగ్లిష్ పదాలు చదవించి వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. అలాగే అరిగిపాలెం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 బాలభాస్కరరావు సందర్శించారు. విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించడంతో పాటు విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

రోడ్డు కోసం ఆందోళన


ఆందోళన చేస్తున్న ఆతవ గ్రామస్తులు, వివిధ సంఘాల నేతలు


సంఘాల నాయకులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

వేపాడ: మండలంలోని ఆతవ గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు సీపీఎం, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆతవ గ్రామ జంక్షన్ వద్ద సోమవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్, ప్రజాసంఘాల నాయకుడు ఆతవ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ వేపాడ–సోంపురం ప్రధాన రహదారి నుంచి ఆతవ గ్రామానికి తక్షణం తారు రోడ్డు నిర్మించాలని కోరారు. గత ప్రభుత్వంలో తారురోడ్డు నిర్మాణానికి నాబార్డు నుంచి నిధులు మంజూరు చేశారని, పనులు ప్రారంభించి మెటల్‌వర్క్ పూర్తి చేశారని చెప్పారు. అయితే కల్వర్టులు నిర్మించకుండా, తారు వేయకుండా వదిలేయడంతో రోడ్డు రాళ్లు తేలిపోయి అధ్వానంగా తయారైందని, నడిచి వెళ్లేందుకు కూడా గ్రామస్తులు అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు,పాలకులు, కాంట్రాక్టర్ స్పందించి తక్షణం రోడ్డు పనులు పూర్తి చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మార్చి15లోగా రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తాం...

పీఆర్ పీఐయూ డీఈ సత్యనారాయణమూర్తి, ఎంపీడీఓ సూర్యనారాయణ, జేఈ మానస, పీఆర్ జేఈ మహమ్మద్ ఆలీ తదితరులు ఆతవ గ్రామస్తులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకుని వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి నాబార్డు నిధులు మంజూరయ్యి ఉన్నాయని, అనివార్య కారణాల వల్ల పనులు ఆలస్యమ య్యాయని, పదిరోజుల్లో పనులు మళ్లీ ప్రారంభించి మార్చి15లోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ గ్రామస్తులు, సంఘాల నాయకులు ఆందోళన విరమిం చేందుకు సుముఖత చూపలేదు. పనులు ప్రారంభించేవరకు ఆందోళన కొనసాగిస్తామని అధికారులకు తెలిపారు. గ్రామస్తుల నిరసనకు దళిత మహాసభ జిల్లా నాయకుడు గంటాన అప్పారావు, డీసీసీబీ మాజీ చైర్మన్ చినరాము నాయుడు, సీపీఎం, మాలమహానాడు, రైతుసంఘం నేతలు కండిపల్లి పెదనాయుడు, గొల్ల ఈశ్వరరావు, దేబార్కి కిరణ్, కర్రి దేముడు, సన్నిబాబు, నాగరాజు, దప్పురాజు, గురుమూర్తి తదితరులు సంఘీభావం తెలిపారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే


చీపురుపల్లి: ర్యాలీ చేస్తున్న ఎలక్ట్రీషియన్లు


శృంగవరపుకోట: ఎస్.కోట దేవీ జంక్షన్ వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

చీపురుపల్లి: ఎలక్ట్రీషియన్ డేను పురస్కరించుకుని పట్టణంలో శ్రీ కనకదుర్గ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. కనకదుర్గ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్, కార్మిక సంఘం అధ్యక్షుడు శ్రీహరి, సంఘ సభ్యులు విద్యుత్ బల్బు కనిపెట్టిన థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేశారు. సంఘం ఉపాధ్యక్షుడు ఏ.నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ, సీనియర్ సభ్యులు రమేష్, దుర్గారావు,తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరిలో శ్రీపుణ్యగిరి దారగంగమ్మ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డే నిర్వహించారు. యూనియన్ సభ్యులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనంతరం స్థానిక దేవీ జంక్షన్ మీదుగా పట్టణంలో బైక్ ర్యాలీ చేశారు. తమతో పాటూ వృత్తి, ఉపాధి పనుల్లో గాయపడిన కొంత మంది వర్కర్లకు ఇతోధికంగా ఆర్థిక సాయం అందించారు. యూనియన్ సభ్యులు సీహెచ్.సింహాచలంనాయుడు, కె.అప్పారావు, డి.రాజు, ఆనంద్, మోపాడ నాయుడు, బి.రుషి, పట్నాయక్, కోటి, నారాయణరావు, ఆర్.సంతు, కె.చంద్రశేఖర్, పి.రవీంద్ర పి.అప్పలస్వామినాయుడు, మాట్లాడుతూ చేతి వృత్తులు, వృత్తి పనివారు, భవన నిర్మాణ రంగ కార్మికుల మాదిరిగా తమను ప్రభుత్వం గుర్తించాలని, పనిముట్లు కొనుగోలుకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

మద్యం షాపుల కేటాయింపుల్లో అన్యాయం

శృంగవరపుకోట: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాల విషయంలో ఎస్.కోట నియోజకవర్గానికి చెందిన యాతకులస్తులకు అన్యాయం చేసిందని యాతకులస్తులు బహిరంగంగా విమర్శి స్తున్నారు. జిల్లాలో సంఖ్యాపరంగా ఎక్కువ మంది యాత కులస్తులు ఉన్నప్పటికీ, జనాభా ధామాషా ప్రకారం మద్యం దుకాణాలు కేటాయింపులు జరగలేదని పైడిమాంబ యాత సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిమ్మ అప్పారావు, తదితర నాయకులు ఆరోపిస్తున్నారు. ఎస్.కోట నియోజకవర్గంలో యాతకులస్తులు ఎక్కువ మంది ఉన్నా, కేటాయింపుల్లో ప్రభుత్వం న్యాయం చేయలేదన్నారు. జామిలో యాతకులస్తులు లేకున్నా శెట్టి బలిజ వర్గానికి ఒక దుకాణం కేటాయించారని అన్నారు. జామి, ఎస్.కోట మండలాల్లో యాతకులస్తులు ఎక్కువమంది ఉన్నారని, ఈ రెండు మండలాల్లో యాతకులస్తులకు మద్యం దుకాణాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు పరిశీలిస్తున్న పీఓ రాజేశ్వరి

చీపురుపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిబ్బందికి ఐసీడీఎస్ పీఓ ఎం.రాజేశ్వరి సూచించా రు. పట్టణంలోని రామాంజనేయ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా పిల్లల బరువు, ఎత్తు పరిశీలించారు. వయసుకు తగ్గ బరువు ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, బాలిం తలు, గర్భిణులకు సక్రమంగా అందించాలన్నారు. ఆమె వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్త బి.రాము ఉన్నారు.

నేత్రవైద్య శిబిరం


వృద్ధురాలికి నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలస గ్రామంలో విజయనగరానికి చెందిన వైష్ణవ్ ఐకేర్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ లక్ష్మణ్ 35మందికి కంటి పరీక్షలు చేసి 20 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. ఈసంద ర్భంగా ఆప్తాలమిక్ మాట్లాడుతూ శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని చెప్పారు. తమ వాహనాల్లోనే ఆస్పత్రికి తీసుకువెళ్లి, తిరిగి ఇళ్లకు పంపిస్తామని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మంత్రి అప్పలనాయుడు, సర్పంచ్ క్రాంతికుమార్ శిబిరాన్ని సందర్శించారు.

దివ్యాంగులకు 'పింఛన్' ఇక్కట్లు..


తేరుకున్న వృద్ధురాలు బంగారమ్మ

విజయనగరం ఫోర్ట్: కూటమి ప్రభుత్వం చేపట్టిన పింఛన్ పునఃపరిశీలన వల్ల దివ్యాంగులకు ఇక్కట్లు తప్పడం లేదు. అనర్హులను ఏరివేయాలనే ఉద్దేశంతో ముందుగా దివ్యాంగ పింఛన్లను పునఃపరిశీలిస్తున్నారు. ఈక్రమంలో గుర్ల మండలం పల్లిగండ్రేడు గ్రామానికి చెందిన బంగారమ్మ అనే దివ్యాంగ వృద్ధురాలు పింఛన్ పునఃపరిశీలనకు సోమవారం స్థానిక సర్వజన ఆస్పత్రికి వచ్చింది. పరిశీలన అనంతరం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పోర్టికో వద్ద మెట్లు దిగుతుండగా కింద పడిపోయింది. దీంతో ఆమెతో వచ్చిన బంధువులు సమర్యలు చేశారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత బంగారమ్మను ఇంటికి తీసుకెళ్లారు.

వైభవంగా పరదేశమ్మ తీర్థం


లక్కవరపుకోట: పరదేశమ్మను దర్శించుకుంటున్న భక్తులు

లక్కవరపుకోట: భీమాళి గ్రామంలో పరదేశమ్మ తల్లి తీర్థమహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థం నేపథ్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేత జట్టుతో పాటు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన జట్లుకు సర్పంచ్ కొయ్యాన కృష్ణ బహుమతులు అందజేశారు.

బల్లంకిలో..

వేపాడ: బల్లంకి గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి తీర్థం రెండోరోజు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చు ట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బొండపల్లి జెడ్పీటీసీకి తీవ్ర అస్వస్థత

బొండపల్లి: జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉదయం మండల కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొని 11 గంటల తర్వాత విజయనగ రంలోని తన నివాసానికి చేరుకున్నారు.రాత్రి 8 గంటల సమయంలో ఓ టీస్టాల్ వద్ద కుప్పకూలి పడిపోవడంతో కుటుంబ సభ్యు లు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీపీ చల్లా చలం నాయుడు, నాయకులు ఆస్పత్రికి చేరుకుని జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బానాది ఇన్‌చార్జి కార్యదర్శిపై చర్యలు తీసుకోండి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, పలుగ్రామాల సర్పంచ్‌లు

వేపాడ మండలం బానాది పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఏ.నారాయణమూర్తిపై చర్యలు తీసుకోవాలని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మండలంలోని 29 గ్రామాల సర్పంచ్‌లు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కోరారు.జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో ఇన్‌చార్జి కార్యదర్శి పనితీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా కడుబండి మాట్లాడుతూ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ఇష్టారాజ్యంగా సచివాలయాన్ని తరలించినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ఇన్‌చార్జి కార్యదర్శి పంచాయతీ ప్రజల మధ్య వివాదాలు సృష్టిస్తున్నారన్నారని, విధి నిర్వహణలో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని, తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. బానాది సర్పంచ్ కర్రి యశోద మాట్లాడుతూ ఇన్‌చార్జి కార్యదర్శి దాదాపు ఏడు నెలలుగా పంచాయతీ సమావేశాలు నిర్వహించక పోవడం, తీర్మానాలు చేయకపోవడం వల్ల గ్రామాభివృద్ధి కుంటిపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 5 సెంట్ల తమ సొంతభూమిని గిఫ్ట్ డీడ్‌గా పంచాయతీకి ఇచ్చి, ఆ స్థలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.40 లక్షలతో సచివాలయ భవనం నిర్మించామని చెప్పారు. ఇప్పుడు నిబంధనలకు విరుద్ధంగా అక్కడి నుంచి సచివాలయాన్ని తరలించినప్పటికీ జిల్లా యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ముందుగా కలెక్టరేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం ఎదుట సర్పంచ్‌లతో కలిసి మాజీ ఎమ్మెల్యే కడుబండి నిరసన తెలిపారు. డీసీసీబీ మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ సభ్యుడు శానాపతి అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మమ్ములూరి జగన్నాథం, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు నీరుజోగి వెంకటరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.
– వేపాడ

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా జాగ్రత్తలు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికా రి పుష్పాంజలి సూచించారు. తుమికాపల్లి గ్రామంలో సోమవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యసిబ్బందితో కలిసి శిబిరం లో 55 మందికి వైద్యాధికారి వివిధ వైద్య పరీక్షలు చేశారు.అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.
– గజపతినగరం

అవగాహనతో క్షయ అంతం



ప్రాణాంతక క్షయ (టీబీ) వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి లక్షణాలను సకాలంలో గుర్తించి మందులు వాడితే నయమవుతుందని జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు. పెద మానాపురం గ్రామస్తులకు దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది టీబీ యూనిట్ సూపర్‌వైజర్ జి.రాము ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలను వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్షయ లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ గొటివాడ దాసు, వైద్య సిబ్బంది అర్జున్,జ్యోతి, రమణమ్మ పాల్గొన్నారు.
– దత్తిరాజేరు

దళితుల భూములంటే చులకనా?


రోడ్డు పనుల కోసం వచ్చిన జేసీబీని అడ్డుకున్న ఎస్సీ కులస్తులు

శృంగవరపుకోట: మండలంలోని ఆలుగుబిల్లి రెవెన్యూ గ్రామంలోని ఎస్సీలు తిరగబడ్డారు. తమ భూముల్లో అధికార పార్టీ నాయకుల పేర్లు చెప్పి క్వారీ యజమానులు అక్రమంగా వేస్తున్న రోడ్డు పనులను సోమవారం అడ్డుకున్నారు. కొట్టాం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 464 కొండపోరంబోకును ఏళ్ల తరబడి సాగుచేస్తున్నామని, గతంలో కొండపై ఉన్న విష్ణు ఆలయం బ్లాస్టింగ్‌లకు దెబ్బతింటోందని కలెక్టర్ వీరబ్రహ్మయ్యకు ఫిర్యాదు చేయడంతో బ్లాస్టింగ్‌లు ఆపేశారన్నారని ఎస్సీ రైతులు చెప్పారు. ఇప్పుడు అధికార పార్టీ పేరు చెప్పి 9.4 హెక్టార్లు లీజుకు తీసుకున్నవారు తమ భూముల్లో క్వారీ వాహనాలు, సామగ్రిని ఉంచేందుకు పూనుకోవడంపై ఆందోళన వ్యక్తంచేశారు. చామలాపల్లి, ఆలుగుబిల్లి ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో క్వారీలు ఏర్పాటు చేసుకున్న యజమానులు ఇప్పుడు తమ భూములపై కన్ను వేశారన్నారు. రెవెన్యూ అధికారులు విచారణ చేసి, కొండ పోరంబోకు భూములకు పట్టాలు ఇప్పించాలని కోరారు. ఇదే విషయాన్ని ఆర్ఐ మనోజ్ వద్ద ప్రస్తావించగా వీఆర్వోను విచారణకు పంపుతామన్నారు.

సంక్షిప్తంగా..

మండలానికో మద్యం దుకాణం కేటాయించాలి


మాట్లాడుతున్న అప్పారావు

గజపతినగరం: కల్లు గీత కార్మికులకు ప్రభుత్వం మండలానికి ఒకటి చొప్పున మద్యం దుకాణం కేటా యించా లని జిల్లా గీత కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో గీత కార్మికుల సంఖ్య ఆధారంగా మద్యం దుకాణాలు కేటాయించేలా ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. గీత కార్మికులు లేని చోట షాపులు ఏర్పాటు చేయడం తగదని అన్నారు. ప్రతీ నియోజకవర్గంలో గౌతులచ్చన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల హక్కులను కాలరాసినా, వారి ఉపాధికి గండి కొట్టినా రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేయక తప్పదని హెచ్చరించారు. సంఘం నియోజకవర్గ కన్వీనర్ కె.కోటారావు, బొండపల్లి మండల అధ్యక్షుడు కె.సూరప్పడు, గౌరినాయుడు,తదితరులు పాల్గొన్నారు.

బోరు ఆక్రమణ


బోరు ప్లాట్‌ఫామ్ తొలగించి చేపడుతున్న ఇంటి నిర్మాణం

బొండపల్లి: వేండ్రాం గ్రామ బీసీ కాలనీలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాగునీటి హ్యాండ్ బోరు ఆక్రమణకు గురయ్యిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో ఏర్పాటు చేసిన హ్యాండ్ బోరు పక్కనే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, ఈ క్రమంలోనే సదరు వ్యక్తి బోరు ప్లాట్‌ఫామ్‌ను పూర్తిగా తొలగించి బోరు ఆక్రమణకు పాల్పడ్డారని గ్రామస్తుల ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఆర్ డబ్ల్యూఎస్ జేఈఈ సునీల్ కుమార్ వద్ద సాక్షి ప్రస్తావించగా... ఈవిషయం తమ దృష్టికి వచ్చిందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసు కోవాలని పంచాయతీ కార్యదర్శితో పాటు, ఈఓపీఆర్డీకి సూచించామని చెప్పారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


కొట్యాడ హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో సమావేశమైన మంజుల

లక్కవరపుకోట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల ఉపాధ్యాయులను కోరారు. మండలంలోని కొట్యాడ,లక్కవరపుకోట,గొల్జాం ఉన్నత పాఠశాలల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న పాకలపాటి రఘువర్మకు ఉపాధ్యాయులు తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఏపీటీఎఫ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.